
# అల్కారజ్ ఔట్

**ఒసాకాకూ షాక్**

**యూఎస్ ఓపెన్‌లో సంచలన ఫలితాలు**



న్యూయార్క్: సీజన్ ఆఖరి గ్రాండ్‌స్లామ్ అయిన యూఎస్ ఓపెన్‌లో ఐదో రోజు సంచలన ఫలితాలు వెలువడ్డాయి. టైటిల్ ఫేవరేట్లలో ఒకడిగా ఉన్న టాప్ సీడ్ కార్లోస్ అల్కారజ్‌కు రెండో రౌండ్‌లోనే షాక్ తగిలింది. మూడో సీడ్‌గా బరిలోకి దిగిన ఈ స్పెయిన్ కుర్రాడు పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో 1-6, 5-7, 4-6తో బొటిక్ వాన్ డి (నెదర్లాండ్స్) చేతిలో పరాభవం పాలయ్యాడు. తొలి సెట్ నుంచే లయ కోల్పోయిన అల్కారజ్.. బొటిక్ బలమైన ఫోర్‌హ్యాండ్ షాట్ల ముందు తేలిపోయాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టైటిల్స్ నెగ్గడంతో పాటు ఒలింపిక్స్‌లోనూ రజతం సాధించిన అల్కారజ్.. యూఎస్ ఓపెన్‌పై కన్నేసినా అతడికి నిరాశ తప్పలేదు. ఇతర మ్యాచ్‌లలో డేనియల్ మెద్వెదెవ్ (రష్యా) 6-3, 6-2, 7-6 (5/7)తో ఫాబియన్ మరొజన్ (హంగేరి)ని ఓడించగా జన్నిక్ సిన్నర్ (ఇటలీ), టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా), డాన్ ఎవాన్స్ (బ్రిటన్) తమ ప్రత్యర్థులను ఓడించి మూడో రౌండ్‌కు చేరారు.

**ఒసాకాకు షాక్**

మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో మాజీ చాంపియన్ నవోమి ఒసాకా (జపాన్) 3-6, 6-7 (5/7)తో కరొలినా ముచొవ (చెక్ రిపబ్లిక్) చేతిలో పరాభవం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఎలీనా రిబాకినా (కజకిస్థాన్) గాయం కారణంగా పోటీ నుంచి తప్పుకుంది. కరొలిన్ వొజ్నియాకి (డెన్మార్క్), ఇగా స్వియాటెక్ (పోలండ్), జాస్మిన్ పాలోని (ఇటలీ) మూడో రౌండ్‌కు చేరారు.

# అట్కిన్సన్ ఆల్‌రౌండ్ షో

- పట్టు బిగిస్తున్న ఇంగ్లండ్



లండన్: సొంతగడ్డపై శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఆతిథ్య జట్టు రెండో రోజూ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఓవర్‌నైట్ స్కోరు 74తో రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన ఇంగ్లండ్ లోయరార్డర్ ఆటగాడు గస్ అట్కిన్సన్ (118) సెంచరీతో మెరవడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 427 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన శ్రీలంక.. 55.3 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌట్ అయింది. ఆ జట్టులో కమిందు మెండిస్ (74) టాప్ స్కోరర్. బ్యాట్‌తో సెంచరీ బాదిన అట్కిన్సన్ బంతితోనూ (2/40) రాణించాడు. వోక్స్, స్టోన్, పాట్స్ తలా రెండు వికెట్లు పడగొట్టారు.

## ముంబైకి ఘోర పరాభవం

కోయంబత్తూరు: బుచ్చిబాబు టోర్నీలో స్టార్లతో కూడిన ముంబై క్రికెట్ జట్టు దారుణ పరాభవానికి గురైంది. తమిళనాడు నిర్దేశించిన 510 పరుగుల భారీ ఛేదనలో ముంబై.. 223 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో తమిళనాడు 286 రన్స్ తేడాతో ఘన విజయం నమోదుచేసి సెమీస్‌లోకి ప్రవేశించింది. శ్రేయస్ అయ్యర్ (22) విఫలమవగా సర్ఫరాజ్ డకౌట్ అయ్యాడు. చేతి గాయం కారణంగా సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్‌కు రాలేదు. తమిళనాడు బౌలర్లలో అచ్యుత్, సాయి కిషోర్ తలా మూడు వికెట్లు తీశారు.

## ఆర్తికి కాంస్యం



లిమా: లిమా(పెరూ) వేదికగా జరుగుతున్న అండర్-20 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ బోణీ కొట్టింది. శుక్రవారం జరిగిన మహిళల 10,000మీటర్ల రేస్‌వాక్‌లో ఆర్తి కాంస్య పతకంతో మెరిసింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన పోరులో ఆర్తి 44 నిమిషాల 39.39 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో 17 ఏండ్ల ఆర్తి జాతీయ రికార్డును తన పేరిట లిఖించుకుంది. మహిళల హైజంప్‌లో పూజసింగ్ ఫైనల్లోకి ప్రవేశించింది.

# భారత్ పతక ధమాకా

## పారాలింపిక్స్‌లో భారత్‌కు ఒకేరోజు 4 పతకాలు

**మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో అవనికి స్వర్ణం • మోనా అగర్వాల్‌కు కాంస్యం**

**రజతంతో మెరిసిన మనీశ్ నర్వాల్ • అథ్లెటిక్స్‌లో ప్రీతి పాల్‌కు కాంస్యం**



**పారాలింపిక్స్‌లో రెండో రోజు భారత్ పతకాల పంట పండించింది. పారిస్ వేదికగా జరుగుతున్న ఈ క్రీడలలో భారత్ ఒకే రోజు నాలుగు పతకాలతో సత్తా చాటింది. షూటింగ్ విభాగంలో మన పారా షూటర్లు గంటల వ్యవధిలోనే మూడు పతకాలు సాధించగా అథ్లెటిక్స్‌లోనూ భారత్ బోణీ కొట్టింది. టోక్యో పారాలింపిక్స్‌లో స్వర్ణంతో మెరిసిన యువ షూటర్ అవని లేఖరా 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో తన పతకాన్ని నిలబెట్టుకోగా ఇదే క్రీడాంశంలో మోనా అగర్వాల్ మూడో స్థానంతో కంచు మోత మోగించింది. యువ పారా అథ్లెట్ ప్రీతి పాల్ వంద మీటర్ల పరుగు పందెంలో చిరుతలా దూసుకొచ్చి కాంస్యం దక్కించుకుంది. పురుషుల పది మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో మనీశ్ నర్వాల్ రజతం సాధించడంతో భారత్‌కు ఒకే రోజు 4 పతకాలు దక్కాయి.**

పారిస్: పారాలింపిక్స్ తొలి రోజు పలు క్రీడాంశాలలో శుభారంభం చేసిన భారత పారా క్రీడాకారులు రెండో రోజు పతకాల పంట పండించారు. షూటింగ్‌లో మన షూటర్లు స్వర్ణం, రజతం, కాంస్యం సాధించి మూడు పతకాలతో మెరవగా అథ్లెటిక్స్‌లోనూ భారత్ బోణీ కొట్టింది. పది మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ (ఎస్‌హెచ్1 కేటగిరీ)లో భారత యువ పారా షూటర్ అవని లేఖరా వరుసగా రెండో స్వర్ణంతో మెరిసింది. మూడేండ్ల క్రితం టోక్యో వేదికగా ముగిసిన పారాలింపిక్స్‌లోనూ ఇదే ఈవెంట్‌లో గోల్డ్ మెడల్ కొట్టిన అవని.. తాజాగా పారిస్‌లోనూ ఆ ప్రదర్శనను పునరావృతం చేసింది. 249.7 పాయింట్లు స్కోరు చేసిన అవని టోక్యో రికార్డు (249.6)ను అధిగమించింది. స్టేజ్ 1లో పదికి పది షాట్లలో ప్రతి షాట్‌ను లక్ష్యానికి గురిపెట్టిన అవని.. స్టేజ్ 2లో 14 షాట్లలో ఒక్క షాట్‌ను మాత్రమే 9.9 పాయింట్లు స్కోరు చేసింది. పారాలింపిక్స్‌లో అవనికి ఇది మూడో పతకం కావడం విశేషం. టోక్యోలో 10మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణం గెలిచిన ఆమె 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లోనూ కాంస్యం నెగ్గింది.

### మోనాకు కాంస్యం..



అవని స్వర్ణం గెలిచిన ఈవెంట్‌లోనే మరో భారత్‌కు డబుల్ ధమాకా దక్కింది. షూటర్ మోనా అగర్వాల్ కాంస్యంతో మెరవడంతో పోడియంపై మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 228.7 పాయింట్లతో మోనా కాంస్య పతకాన్ని దక్కించుకుంది. కొరియా అమ్మాయి లీ యున్రి 246.8 పాయింట్లతో రజతం గెలుచుకుంది.

### ప్రీతి పాల్‌కు మూడో స్థానం



మహిళల వంద మీటర్ల (టీ35 విభాగం) ఈవెంట్‌లో భారత పారా అథ్లెట్ ప్రీతి పాల్ కాంస్యం నెగ్గింది. ప్రఖ్యాత స్టేట్ డి ఫ్రాన్స్ స్టేడియం వేదికగా జరిగిన రేసులో 23 ఏండ్ల ప్రీతి.. రేసును 14.21 సెకన్లలో పూర్తిచేసి పారిస్‌లో భారత అథ్లెటిక్ బృందం తరఫున తొలి పతకాన్ని అందించింది. యూపీలోని ముజఫర్‌నగర్‌లో సామాన్య రైతు కుటుంబానికి చెందిన ప్రీతి.. చిన్ననాటి నుంచే శారీరకంగా అనేక సవాళ్లను ఎదుర్కొంది. ఇవే క్రీడల్లో ఆమె 200 మీటర్ల ఈవెంట్‌లోనూ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.

### నాలుగో పతకం తెచ్చిన మనీశ్ నర్వాల్



పారాలింపిక్స్‌లో శుక్రవారం భారత్‌కు అమ్మాయిలే మూడు పతకాలు అందించగా నాలుగో పతకాన్ని మనీశ్ నర్వాల్ తీసుకొచ్చాడు. పురుషుల పది మీటర్ల ఎయిర్ పిస్టల్ (ఎస్‌హెచ్1 కేటగిరీ) ఈవెంట్‌లో మనీశ్ రజతంతో మెరిశాడు. ఈ పోటీలలో 234.9 పాయింట్లు స్కోరు చేసిన అతడు రెండో స్థానంలో నిలిచాడు. కొరియాకు చెందిన జొ జియొన్డు 237.4 పాయింట్లతో స్వర్ణం గెలవగా చైనా షూటర్ యంగ్ చావొ 214.3 స్కోరుతో కాంస్యం నెగ్గాడు. స్టేజ్ 2లో చివరిదాకా అగ్రస్థానంలో ఉన్న నర్వాల్.. ఆఖర్లో గురి తప్పడంతో తృటిలో పసిడి పతకాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

**3** **పారాలింపిక్స్‌లో అవనికి ఇది మూడో పతకం. టోక్యోలో ఆమె స్వర్ణం, కాంస్యం సాధించింది.**

## సుహాస్, నితేశ్ ముందంజ

పారా బ్యాడ్మింటన్‌లో సుహాస్ యతిరాజ్, నితేశ్ కుమార్ సెమీస్‌కు దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్4 కేటగిరీ క్వార్టర్స్‌లో సుహాస్ 26-24, 21-14తో షిన్ క్యుంగ్ హ్వాన్ (కొరియా)ను ఓడించాడు. ఎస్‌ఎల్3 విభాగంలో నితేశ్.. 21-5, 21-11తో చైనాకు చెందిన యంగ్ జియాన్‌యున్‌ను చిత్తుచేశాడు. కాగా మానసి జోషి, టోక్యో కాంస్య పతక విజేత మనోజ్ సర్కార్ పోరాటం ముగిసింది. ఆర్చరీ పురుషుల కాంపౌండ్ ఓపెన్ కేటగిరీ రాకేశ్ కుమార్ ప్రీక్వార్టర్స్ చేరాడు. టేబుల్ టెన్నిస్‌లో సోనియాబెన్, భవీనా పటేల్ ద్వయం 1-3తో మూన్ సుంగ్-జంగ్ యంగ్ (కొరియా) చేతిలో ఓటమి పాలైంది. రోయింగ్ మిక్స్‌డ్ పీఆర్3 డబుల్ స్కల్స్‌లో భారత రోయర్లు అనిత, కొంగనపల్లె ఐదో స్థానంతో సరిపెట్టుకున్నారు. మహిళల డిస్కస్ త్రో (ఎఫ్55)లో సాక్షి కసానా 8వ స్థానంలో నిలిచింది.

### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 6 | 7 | 3 | 16 |
| 2 | బ్రిటన్ | 6 | 5 | 3 | 14 |
| 3 | బ్రెజిల్ | 4 | 1 | 4 | 9 |
| 4 | నెదర్లాండ్స్ | 4 | 1 | 1 | 6 |
| 5 | ఇటలీ | 3 | 2 | 7 | 12 |
| 6 | ఆస్ట్రేలియా | 3 | 2 | 2 | 7 |
| 14 | భారత్ | 1 | 1 | 2 | 4 |

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

## డ్యూరండ్ చాంప్ నార్త్‌ఈస్ట్ యునైటెడ్

**ఫైనల్‌లో మోహన్ బగాన్ ఓటమి**

కోల్‌కతా:ప్రతిష్టాత్మక డ్యూరండ్ కప్ లో సంచలనం. ఈ టోర్నీ చరిత్రలో అత్యధికంగా 17 టైటిల్స్ నెగ్గి 18వ టైటిల్‌పై కన్నేసిన మోహన్ బగాన్‌కు నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎన్‌ఈయూఎఫ్‌సీ) అనూహ్య షాకిచ్చింది. ఫైనల్‌లో నార్త్‌ఈస్ట్ యునైటెడ్ 4-3 (2-2)తో మోహన్ బగాన్‌ను ఓడించి తొలిసారి డ్యూరండ్ కప్‌ను సొంతం చేసుకుంది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు తలా రెండు గోల్స్‌తో సమంగా ఉండటంతో పెనాల్టీల ద్వారా తేలిన ఫలితంలో నార్త్‌ఈస్ట్ తొలి కప్‌ను ఎగురేసుకుపోయింది.

## రెండు రకాలుగా కనిపిస్తాడట!



జయాపజయాలకు అతీతమైన ఇమేజ్ విజయ్ దేవరకొండది. ప్రస్తుతం ఆయన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇటీవలే శ్రీలంకలో భారీ షెడ్యూల్‌ని పూర్తి చేసుకుని చిత్రబృందం హైదరాబాద్ చేరుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్‌ని మొదలుపెట్టారు. ఇదిలావుంటే.. ఈ సినిమా విషయంలో ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ ఒకటి వెలుగు చూసింది. ఇందులో విజయ్ దేవరకొండ కానిస్టేబుల్‌గా, ఖైదీగా రెండు రకాలుగా కనిపించనున్నారట. ఇందుకోసం ఆయన ప్రత్యేకమైన ఓ లుక్‌ని కూడా సెట్ చేసుకున్నారట. ఇందులో విజయ్ దేవరకొండ నటవిశ్వరూపాన్ని చూస్తారని చిత్రబృందం చెబుతున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 75శాతం పూర్తయింది. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చిలో విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: అనిరుధ్.

## గబ్బర్‌సింగ్‌కి అప్‌డేట్ వెర్షన్‌గా



పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై నిర్మాతలు ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ అందించారు. అతి త్వరలోనే ఈ సినిమా షూటింగ్ మొదలు కానున్నదని వారు తెలిపారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. హరీశ్‌శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఇప్పటికే చాలా వరకు చిత్రీకరణ పూర్తి చేసుకున్నది. ఈ సినిమా గురించి రీసెంట్‌గా నిర్మాతలు మాట్లాడుతూ - 'ఇటీవలే పవన్‌కల్యాణ్‌ని కలిశాం. ఆయన షూటింగ్‌కి సుముఖంగానే ఉన్నారు. డేట్స్ ఇస్తే డిసెంబర్ నాటికి షూటింగ్ కంప్లీట్ చేస్తాం. 'గబ్బర్‌సింగ్'కి అప్‌డేట్ వర్షన్‌లా ఉంటుంది మా 'ఉస్తాద్ భగత్ సింగ్' అని అన్నారు. సెప్టెంబర్ 2న పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ఓ స్పెషల్ ట్రీట్ ఇవ్వబోతున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అయనంక బోస్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

## వనపర్తిలోనే పెండ్లి

చిత్రం



ఈ ఏడాది మార్చిలో హీరో సిద్ధార్థ్, కథానాయిక అదితిరావు హైదరీల నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి ఆలయంలో నిశ్చితార్థ వేడుకను నిర్వహించారు. అదే ఆలయంలో తామిద్దరం పెళ్లి చేసుకుంటామని తాజా ఇంటర్వ్యూలో అదితిరావు హైదరీ చెప్పింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్‌తో తన ప్రేమ, పెళ్లి గురించి ఆమె ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. 'మహాసముద్రం' సినిమా షూటింగ్ సమయంలోనే సిద్ధార్థ్‌తో ఏర్పడిన పరిచయం క్రమంగా ప్రేమగా మారిందని చెప్పింది. హైదరాబాద్‌లో తన నాన్నమ్మ ప్రారంభించిన స్కూల్ అంటే ఎంతో ఇష్టమని, తన చిన్నతనం మొత్తం అక్కడే గడచిపోయిందని, అదే స్కూల్‌కి తీసుకెళ్లి సిద్ధార్థ్ తనకు లవ్‌ప్రపోజ్ చేశాడని అదితిరావు తెలిపింది. పెళ్లి గురించి మాట్లాడుతూ 'శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి ఆలయంతో మా కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది. అందుకే అక్కడే నిశ్చితార్థం చేసుకున్నాం. పెళ్లి కూడా అక్కడే చేసుకోవాలని నిర్ణయించుకున్నాం' అని అదితిరావు హైదరీ పేర్కొంది.



## నిర్దోషి కోసం న్యాయపోరాటం

ప్రియదర్శి ప్రధాన పాత్రలో రూపొందుతోన్న చిత్రం 'కోర్ట్ - స్టేట్ వర్సెస్ ఏ నోబడీ'. రామ్‌జగదీశ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రశాంతి త్రిపురనేని నిర్మాత. హీరో నాని ఈ సినిమాకు సమర్పకుడు. ఈ సినిమా శుక్రవారం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి హీరో నాని క్లాప్ కొట్టగా, నిర్మాత ప్రశాంతి కెమెరా స్విచాన్ చేశారు. జెమినీ కిరణ్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన టైటిల్ పోస్టర్.. బోనులో న్యాయదేవత, శాంతి చిహ్నాలుగా ఎగురుతున్న పావురాలతో ఆసక్తికరంగా ఉంది. అన్యాయంగా ఓ కేసులో ఇరుక్కున్న కుర్రాడికోసం జరిగే న్యాయపోరాటం చుట్టూ ఈ కథ నడుస్తుందని, ప్రియదర్శి ఇందులో లాయర్‌గా నటిస్తున్నాడనీని మేకర్స్ తెలిపారు. సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలు కానున్న ఈ సినిమాలో శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, హర్ష్‌రోషన్, శ్రీదేవి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, నిర్మాణం: వాల్‌పోస్టర్ సినిమా.



## పెళ్లంటే కేజీఎఫ్ యాక్షన్ డ్రామా

పెళ్లిలో తాను ధరించిన తెల్లని వస్త్రాలను నల్లని గౌన్‌గా మార్చుకున్నది సమంత. అవార్డు షో కోసం డిజైనర్ క్రేషా బజాజ్ ఈ గౌన్‌ని డిజైన్ చేశారు. ఇటీవలే ఈ గౌన్‌ని ఇన్‌స్టాలో షేర్ చేశారు సమంత, క్రేషా బజాజ్. ఇదిలావుంటే.. ఏ విషయాన్నయినా కుండ బద్దలు కొట్టేలా మాట్లాడే సమంత.. ఇటీవల పెళ్లి గురించి ఆసక్తికరమైన కామెంట్స్ చేసింది. పనిలోపనిగా దర్శక, నిర్మాత కరణ్ జోహార్‌ని ఉద్దేశించి ఛలోక్తులు విసిరింది 'సంతోషంగా లేని వివాహాలకు కారకుడు కరణ్‌జోహార్. అతడి దృష్టిలో వివాహం ఆదర్శవంతమైనది. ఆ భావనను, వివాహ లెహంగాలపై తనకున్న మక్కువను తెరపై చూపిస్తుంటాడు. చాలామందికి పెళ్లి విషయంలో అపోహకు కారణం అయ్యాడు. అతను పెళ్లిని 'కభీ ఖుషీ కభీ ఘమ్' అంత అందంగా చూపిస్తాడు. కానీ నిజానికి అది 'కేజీఎఫ్' లాగా యాక్షన్, డ్రామా, సంఘర్షణలతో నిండివుంటుంది' అంటూ ఓ వైపు కరణ్‌ని ఆటపట్టిస్తూనే.. మరోవైపు పెళ్లిపై తన విరక్తిని కూడా ప్రకటించింది సమంత.



## పా.రంజిత్ 'బిర్సా ముండా'

సామాజిక సమస్యలను కథావస్తువులుగా తీసుకొని వాటిని కమర్షియల్ పంథాలో ఆవిష్కరిస్తూ ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు తమిళ డైరెక్టర్ పా.రంజిత్. ఆయన తాజా చిత్రం 'తంగలాన్' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించింది. విక్రమ్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని హిందీలో కూడా త్వరలో విడుదల చేయబోతున్నారు. ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొన్న పా.రంజిత్ తన బాలీవుడ్ ప్రాజెక్ట్‌పై ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. హిందీలో స్ట్రెయిట్ సినిమా కోసం స్క్రిప్ట్ సిద్ధం చేశానని, దానికి 'బిర్సా ముండా' అనే టైటిల్‌ను పెట్టానని పా.రంజిత్ తెలిపారు. అగ్ర హీరో ఇందులో నటిస్తాడని ఆయన పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ సినిమా కోసం రణ్‌వీర్ సింగ్‌తో పా.రంజిత్ ఇప్పటికే సంప్రదింపులు జరిపారని తెలిసింది. ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.



## డబుల్ ఫన్ అండ్ థ్రిల్

శ్రీసింహ కోడూరి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మత్తు వదలరా-2'. రితేష్ రానా దర్శకుడు. క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పిస్తున్నది. సెప్టెంబర్ 13న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం టీజర్‌ను విడుదల చేశారు. టీజర్ ఆద్యంతం చక్కటి హాస్యంతో సాగింది. ఈ సందర్భంగా హీరో శ్రీసింహ కోడూరి మాట్లాడుతూ 'తొలిభాగం పెద్ద హిట్ అయింది. దాంతో ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫస్ట్ పార్ట్ కంటే డబుల్ ఫన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దాం' అన్నారు. ఈ సినిమా విజయంపై టీమ్ అంతా కాన్ఫిడెంట్‌గా ఉన్నామని నిర్మాత వై.రవిశంకర్ చెప్పారు. ఈ సినిమాలో తాను ఓ పాట రాయడంతో పాటు పాడానని కథానాయిక ఫరియా అబ్దుల్లా తెలిపింది. తొలిభాగానికి మించిన మలుపులతో సినిమా ఉత్కంఠను పంచుతుందని నిర్మాత చెర్రీ పేర్కొన్నారు. సునీల్, వెన్నెల కిషోర్, అజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ, ప్రొడక్షన్ డిజైనర్: నార్ని శ్రీనివాస్, రచన-దర్శకత్వం: రితేష్ రానా.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.